క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి రథోత్సవం



దేవరపల్లిలో నిర్వహిస్తున్న శ్రీవారి రథోత్సవం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 5వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా బుధవారం శ్రీవారిని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన, డోలు సన్నాయి వాయిద్యాలతో స్వామివారిని వైభవంగా ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

దేవరపల్లి: ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



బ్రాహ్మణగూడెంలో స్వామి వారిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో స్వామి వారిని పురవీధుల్లో మేళతాళాలతో ఉరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ఆలయంలో సుందరంగా అలంకరించారు. పూజలు, అభిషేకాలు చేశారు.ఆలయంలో, భజన కార్యక్రమాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మానవత సంస్థ ఆర్థిక సాయం

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీ మహిళ బొర్రా వీరలక్ష్మి ఇంటిపై పిడుగు పడడంతో శరీరం కాలిపోయి రాజమహేంద్రవరంలోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది.ఈ నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.6 వేలు, సంస్థ సభ్యులు చెరకు ఆంజనేయులు రూ.500, గంధం మునేశ్వరరావు రూ.500 మొత్తం రూ. 7 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు బుధవారం మండల అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

నల్లజర్ల: అయ్యవరంలో పామాయిల్ గెలల కోత పనులకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై కడారి వెంకటేశ్వరావు మృతి చెందాడు. అతనికి భార్య వరలక్ష్మి, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.వీరి ఆర్థిక పరిస్థితిని స్థానికులు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకెళ్లారు. డబ్బులు లేక ప్రభుత్వ బీమా ప్రీమియం చెల్లించలేదని వివరించారు. ఈవిషయాన్ని విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు పరిహారం మంజూరయ్యేలా ఎమ్మెల్యే కృషి చేసారు. 3ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ నుంచి మరో రూ.2 లక్షలు మొత్తం కలిపి రూ.7లక్షలు బుధవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేసారు.

11 గ్రామాల్లో ఎమ్మెల్యే సమావేశాలు : మండలంలోని అయ్యవరం, దూబచర్ల, గంటావారిగూడెం, ముసుళ్లగుంట, పుల్లలపాడు, జగన్నాథపురం, మార్లెమూడి, ఆవపాడు, సింగరాజుపాలెం తదితర గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



కొవ్వూరులో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి (కొవ్వూరు): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో లోపాలు గుర్తించి వారికి అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో దివ్యాంగులకు బుధవారం వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. రూ.3.19 లక్షల విలువైన 42 ఉపకరణాలు లబ్ధిదారులకు అందించామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎంఈవోలు బి.స్వరూప్, కె.రామకిషోర్, టీడీపీ నాయకులు కంఠమణి రామకృష్ణ పాల్గొన్నారు.

పల్లెల్లో నిఘా నేత్రాలు

- దాతల సహకారంతో ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటు
- జాతీయ నేతల విగ్రహాలకు ప్రాధాన్యం
- సుమారు 200 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళిక
- నేరాల నియంత్రణకు దోహదం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది



దేవరపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్

దేవరపల్లి: పల్లెలూ ఇక భద్రంగా ఉండనున్నాయి. గ్రామాల్లో నేరాల నియంత్రణకు, ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు పోలీసులు నిఘా నేత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇకపై నిఘా నేత్రాల వలయంలో గ్రామాలు ఉండబోతున్నాయి. ఈ మేరకు పోలీస్ అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని శక్తివంతమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీసీ కెమెరాల సహకారంతో నేరస్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకొని నేరాలను అదుపు చేస్తున్నారు. దేవరపల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని సుమారు 33 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతి గ్రామంలో దాతల సహకారంతో ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి, బస్టాండ్, జాతీయ నేతల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లోనూ అంచెలంచెలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

దేవరపల్లిలో తొలి ప్రయోగం

మండల కేంద్రమైన దేవరపల్లిలో పలు ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ అధికారులు తొలి ప్రయోగం చేశారు. గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిలో డైమండ్ జంక్షన్, మూడు రోడ్ల ప్రధాన కూడలి, పోలీస్ స్టేషన్ ప్రాంతం, బస్టాండ్ సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దాతలు, వ్యాపారులు, గ్రామస్తుల సహకారంతో సుమారు 50 కెమెరాలను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కన గల వ్యాపార సంస్థలు, హోటళ్లు యజమానుల సహకారంతో ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. దేవరపల్లిలో 50, దుద్దుకూరులో 15, గౌరీపట్నంలో 20, యాదవోలులో 30 కెమెరాలు ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నాయగూడెంలో కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులతో అధికారులు చర్చిస్తున్నారు. మండలంలో సుమారు 200 సీసీ కెమెరాల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు తయారు చేసి ముందుకు సాగుతున్నారు.



దేవరపల్లి మూడు రోడ్ల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలు



దేవరపల్లి బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఆధునిక సీసీ కెమెరాలు

డ్రోన్ కెమెరాతో పహారా

దేవరపల్లి పోలీస్ స్టేషన్‌కు ఓ దాత డ్రోన్ కెమెరా సమకూర్చారు. దీనిని రాత్రి సమయంలో ఉపయోగిస్తున్నారు. డ్రోన్ కెమెరా అవసరాన్ని బట్టి రాత్రి సమయంలో పహారా కాస్తుందని అధికారులు వివరించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల వినియోగం వల్ల నేరస్తుల్లో భయం ఉంటుందని, తద్వారా నేర నియంత్రణ సాధ్యమవుతుందని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల దేవరపల్లి, నిడదవోలు పట్టణాల్లో ఫొటో స్టూడియోల్లో జరిగిన చోరీలను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, నిఘా నేత్రాల ద్వారా సకాలంలో చాకచక్యంగా ఛేదించి నేరస్తులను పట్టుకుని కటకటాల వెనుకకు పంపించారు.

జాతీయ నేతల విగ్రహాల వద్ద నిఘా

జాతీయ నేతల విగ్రహాలకు ముందుగా ప్రాధాన్యత ఇచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద రెండేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపడుతున్నారు. రెండవ దశలో మిగిలిన జాతీయ నేతల విగ్రహాల వద్ద నిఘా నేత్రాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికి యువజన సంఘాల సహకారాన్ని అధికారులు కోరుతున్నారు. కెమెరాలు నిరంతరం పని చేస్తూ ప్రతి కదలికను నిక్షిప్తం చేస్తాయి. అధిక రిజల్యూషన్‌తో కెమెరాలు ఉన్నందున చిన్నపాటి కదలికను కూడా స్పష్టంగా పరిశీలించవచ్చును. సీసీ కెమెరాల ద్వారా పోలీస్ అధికారులు నిరంతరం ఆయా ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరించినా లేదా ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా తక్షణం గుర్తించి చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. గ్రామాల్లో ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు, యువజన సంఘాల సహకారం తీసుకుంటున్నాం. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రతి గ్రామంలో జాతీయ నేతల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. దేవరపల్లిలో ప్రధాన కూడళ్లు, హైవే డైమండ్ జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సర్కిల్ కార్యాయలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం.

– కె. నాగేశ్వర్ నాయక్, సీఐ, దేవరపల్లి

ఇళ్ల వద్ద లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టం

ప్రజలు ఇంటికి తాళం వేసి ఎక్కువ రోజులు ఉండేలా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు చెబుతున్నారు. అటువంటి ఇళ్ల వద్ద లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు రాత్రి సమయంలో ఆ ప్రాంతంలో పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాత్రి సమయంలో గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్టు గమనిస్తే పోలీస్ స్టేషన్ లేదా 100 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



తిరుగుడుమెట్టలో ఆక్రమణను తొలగిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి

తాళ్లపూడి: ప్రభుత్వం ప్రతి నెలా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అపరిష్కృతంగా ఉన్న ఆర్జీలను గుర్తించి కలెక్టర్ ఆదేశాల మేరకు వాటి పరిష్కారం దిశగా తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి తెలిపారు. మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన రెబ్బా ప్రగడ సాయికృష్ణ ఎదుర్కొంటున్న భూ ఆక్రమణ సమస్యను సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిష్కరించినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ పేర్కొన్నారు. గ్రామంలో 205/2 సర్వే నంబర్‌లోని సుబ్బరాజు చెరువుకు చెందిన 6 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్థలాన్ని గుర్తించి ఆక్రమణలు తొలగించామని తెలిపారు.

వలి కుటుంబానికి అండగా ఉంటాం



వలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు: పట్టణంలోని చింతచెట్టు వీధిలో ఇటీవల హత్యకు గురైన వంట మాస్టర్ వలి బాషా కుటుంబానికి అండగా ఉంటామని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ భరోసా ఇచ్చారు. వలి కుటుంబ సభ్యులను బుధవారం పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కే వజీరుద్దీన్, దాకే అనిల్‌కుమార్, ఆకుల ముకుందరావు, నాయకులు ఎస్‌కే ఖాన్‌బాషా, భీమవరపు నాగేంద్ర, సాయి జాకీర్ తదితరులు పాల్గొన్నారు. వంట మాస్టర్ వలిబాషా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ షారుఖ్ షిబ్లీ కోరారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలసి వలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో పెద మసీద్ ముతవల్లి అజీజ్ బాషా, మొహ్మద్ షరీఫ్, షేక్ హైదర్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు



నల్లజర్లలోని వేణుగోపాలస్వామి ఆలయం

నల్లజర్ల: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం నుంచి 12వ తేదీ వరకూ తిరు కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. గురువారం ఉదయం స్వామివారిని పెండ్లి కుమారునిగా చేయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. 11న రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 12న ఉదయం 11 గంటలకు అన్నసమారాధన జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాటం



గోపాలపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాటం చేస్తామని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కూసం రామమోహన్ రెడ్డి నివాసం వద్ద బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు వెల్లగా శ్రీరామమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వుండవల్లి మాట్లాడుతూ మాజీ మంత్రి తానేటి వనితపై ఎల్లో మీడియా చేస్తున్న అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమశిక్షణకు మారుపేరు అని, ఆయన ఎంతో నమ్మకంగా తానేటి వనితకు రాష్ట్ర పార్టీలో క్రమశిక్షణా కమిటీ సభ్యురాలిగా ఎంపిక చేయడమే అందుకు నిదర్శనమన్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు కలిసి ఉమ్మడి కార్యాచరణతో తానేటి వనిత నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చలేదన్న విషయం ఎల్లో మీడియాకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి ఇదే ఆఖరి ఎన్నిక అని అన్నారు. 2029లో వైఎస్సార్ సీపీ ప్రభంజనంలో వారు కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



తిరుగుడుమెట్టలో అందుగుల ముక్కమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అందుగుల రవి తల్లి అందుగుల ముక్కమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ అందుగుల పాప, రవిని పరామర్శించారు. పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఇంటి నాగేశ్వరరావు తండ్రి ఇంటి పుల్లారావు ఇటీవల మృతి చెందారు. నాగేశ్వరరావును పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు తోట రామకృష్ణ, కవల నాగేశ్వరరావు, వల్లభిశెట్టి చిన్ని, నామాప్రకాశం, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు



తాళ్లపూడిలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గ్రామోత్సవం

తాళ్లపూడి: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా తాళ్లపూడిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు జంధ్యాల గంగాధర శాస్త్రి ఆధ్వర్యంలో ఆర్య వైశ్య మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అంతకు ముందు యువకులు ఆధ్వర్యంలో పల్లకీలో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి జనార్ధనరావు, యండపల్లి శేఖర్, అప్పన శ్రీకాంత్, మాణిక్యం, వాసవీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి అమ్మవారి పంచలోహ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకంతో పాటు అమ్మవారికి సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



దేవరపల్లిలో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, అర్చకులు



కల్యాణం అనంతరం వివాహ వేదికపై వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు



శ్రీనివాసుని కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- కన్నులపండువగా శ్రీనివాస కల్యాణం
- తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

దేవరపల్లి: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి అత్యంత కమనీయంగా జరిగింది. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను, శ్రీనివాసుడిని పెండ్లి కుమారుడిగాను అర్చకులు అలంకరణ చేసి వివాహ వేదికపైకి భక్తుల గోవింద నామస్మరణతో తోడ్కొని వచ్చారు. అమ్మవార్లను, స్వామి వారిని పెండ్లి పీటలపై ఉంచి వేద పండితులు, అర్చకులు కల్యాణ తంతు ప్రారంభించారు. రాత్రి 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు శ్రీనివాసుని కల్యాణం నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీనివాసుని కల్యాణం నిర్వహించినట్టు వేదపండితులు తెలిపారు. శ్రీవారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, సారెను స్థానిక భక్త మార్కేండేయ పద్మశాలి సంక్షేమ సంఘం వారు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు కల్యాణ అక్షతలు, తీర్థప్రసాదాలు అందజేశారు. దేవరపల్లి పరిసర గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. శ్రీవారి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. టీటీడీ దేవస్థానం కళాకారుల బృందం అన్నమాచార్య సంకీర్తన స్వరాభిషేకం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

గోపాలపురం: ఉత్సాహంగా కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఏ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలలోని వేళ్లచింతలగూడెం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో విద్యార్థులు ఎండ బారిన పడకుండా పాఠశాలలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు. వలంటీర్ సనమంద్ర కావ్యచందన నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన ప్రశంశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పదవికి వెంకటలక్ష్మి రాజీనామా

నిడదవోలు: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. 2021లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి 4వ వార్డు కౌన్సిలర్‌గా ఆమె గెలుపొందారు. బీసీ వర్గానికి చెందిన వెంకటలక్ష్మికి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు వైస్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. పార్టీకి విధేయతగా ఉండాల్సిన వెంకటలక్ష్మి వైఎస్సార్ సీపీని వీడి జనసేనలో చేరారు. దీంతో పట్టణ ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. వెంకటలక్ష్మి ఈనెల 5న మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణికి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖను అందించారు. ఈనెల 9న నిర్వహించనున్న మున్సిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిల్ ఆమోదం కోసం రాజీనామా అంశాన్ని కమిషనర్ టి. కృష్ణవేణి అజెండాలోకి తీసుకువచ్చారు.

వర్షాలపై అవగాహన కల్పించాలి

రాజమహేంద్రవరం రూరల్: రానున్న ఏడు రోజులు ఉరుములు, మెరుపులతో అధిక వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి బుధవారంక్షేత్ర స్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఎటువంటి పశు, మానవ ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.